అమ్మవారి జాతరకు కేంద్రమంత్రికి ఆహ్వానం



మల్కాజిగిరి: 20,21న జరిగే మల్కాజిగిరి ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి జాతరకు రావాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండిసంజయ్‌ను పార్టీ సీనియర్ నేతలు బక్క నాగరాజు, నర్సింహగౌడ్, ఆనంద్, శోభన్‌బాబులు ఆహ్వానించారు.

లో ఓల్టేజీ సమస్యను పరిష్కరిస్తా

మల్లాపూర్: లో ఓల్టేజీ సమస్యలను పరిష్కరిస్తామని హబ్సిగూడ విద్యుత్ డీఈ సుబ్బారావు అన్నారు. బుధవారం మల్లాపూర్ డివిజన్ పరిధి అశోక్‌నగర్‌లో విద్యుత్ వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా పలు విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్‌వైర్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని స్థానికులు డీఈ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఏడీఈ దశరథ్, ఏఈ నాగరాజు అశోక్‌నగర్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

బోడుప్పల్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హబ్సిగూడ ఎస్ఈ ప్రతిమా శోమ్ అన్నారు. మేడిపల్లి, చెంగిచర్లలోని పలు కాలనీల్లో బుధవారం ఆమె విద్యుత్ అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికంగా నెలకొన్న విద్యుత్ సమస్యలపై స్థానిక ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యలపై నిరంతరం కృషి చేస్తామని, ఎలాంటి సమస్యలున్నా.. తమ దృష్టికి తీసుకొస్తే వాటికి సత్వర పరిష్కారం చూపుతామన్నారు. డీఈ కీసర లింగయ్య, ఘట్‌కేసర్ ఏడీఈ విజయకుమార్‌రెడ్డి, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

అప్పుల బాధతో 7న ఆత్మహత్యాయత్నం

కుషాయిగూడ: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్‌కు చెందిన రఘు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. తన పొలంతో పాటుగా మరికొంత పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసి నష్టపోయాడు. అప్పుల బాధ తాళలేక నాలుగేళ్ల క్రితం భార్య దస్తగిరమ్మ, కూమార్తెతో కలిసి నగరానికి వచ్చాడు. లేబర్‌గా పని చేసుకుంటూ కాప్రా, గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో పెరిగిన అప్పుల బాధ తాళలేక ఈనెల 7న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ వెంకన్న తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోనాల పండుగకు భారీ నిధులు

ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

ఉప్పల్: మహానగరంలో నిర్వహించే బోనాల పండుగకు ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లోనే దాదాపుగా రూ. 20 కోట్ల వరకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. బుధవారం ఉప్పల్ అభయాంజనేయ స్వామి ఆలయం ప్రాంగణంలో ఉప్పల్ నియోజకవర్గ ఆలయాల కమిటీలకు బోనాల పండుగ ఏర్పాట్లకు కావాల్సిన నిధుల చెక్‌లను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి, కార్పొరేటర్లతో కలిసి చెక్కులు పంపిణీ చేశారు.

బాల కార్మికులకు విముక్తి

కుషాయిగూడ: ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా బుధవారం కుషాయిగూడ పోలీసులు పలుచోట్ల వివిధ పనుల్లో ఉన్న 5 మంది బాల కార్మికులను గుర్తించి వారికి విముక్తి కలిగించారు. అనంతరం వారిని సిడబ్ల్యూసీ ఎదుట హాజరు పరిచి, పిల్లలను పనిలో పెట్టిన యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

విద్యుత్ సమస్యలపై ఎస్ఈ పర్యటన

మేడిపల్లి : మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో బుధవారం విద్యుత్ అధికారి ఎస్ఈ హబ్సిగూడ ప్రతిమా సోమ్ పర్యటించారు. కార్పొరేషన్‌లోని వేంకటేశ్వరకాలనీ, చెంగిచెర్ల, మేడిపల్లిలో పర్యటించి ఆయా కాలనీవాసులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం కాలనీవాసులు కాలనీల్లో ఉన్న విద్యుత్ సమస్యలను విద్యుత్ అధికారి ఎస్ఈ హబ్సిగూడ ప్రతిమా సోమ్‌కు వివరించారు. కీసర డీఈ లింగయ్య, ఘట్‌కేసర్ ఏడీఈ విజయ్‌కుమార్‌రెడ్డి, ఏఈలు కాలనీవాసులు పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎస్వీనగర్, బాబానగర్ (నాచారంపార్ట్)లో రూ.50 లక్షలతో స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామన్నారు. అభివృద్ధిలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. దశలవారీగా బస్తీలు, కాలనీల్లో సీసీరోడ్లు వేస్తున్నామని తెలిపారు. డీఈ రూప, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు రామారావు, బిక్షపతి, ఎస్వీనగర్ కాలనీ అధ్యక్షులు నెమలి రవికుమార్, బీఆర్ఎస్ నేతలు కృష్ణ, వాసుగౌడ్, శ్రీశైలం, రవిచారి, సాయికుమార్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి తదితరులు

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మల్లాపూర్: ఉప్పల్ సర్కిల్‌కు చెందిన 320 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్‌లో బుధవారం చేపట్టారు. ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉప్పల్ తహసీల్దార్ వాణిరెడ్డి, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, శాంతిసాయిజెన్‌శేఖర్, ప్రభుదాస్, బన్నాల గీత తదితరులు పాల్గొన్నారు.

మనతో పాటు మరొకరికి ఉపాధి కల్పించడం అభినందనీయం..

ఉప్పల్: చిలుకానగర్ రాఘవేంద్రనగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన బిగ్‌బాస్కెట్ ఆన్‌లైన్ గ్రోసరీ స్టోర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత ప్రభుత్వ ఉద్యోగాల మీద ఆధార పడకుండా తాను ఉద్యోగం పొందుతూ.. మరి కొంత మందికి ఉద్యోగం కల్పించడం అభినందనీయమన్నారు. స్థానికులతో మమేకమవుతూ.. వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. స్థానికులు, బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్, బీఆర్ఎస్ నేతలు నిర్వాహకులు కృష్ణ, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేసున్న ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్లు



గ్రోసరీ స్టోర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ గీత

నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గంలోని పలు సమస్యలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని చెరువుల సుందరీకరణ, సరిహద్దులు నిర్ణయించి ఫెన్సింగ్ వేసి పరరక్షించాలని, బండ చెరువులో మురుగునీరు చేరకుండా డైవర్షన్ లైన్ ఏర్పాటుకు సహకరించాలన్నారు. హిందూ శ్మశానవాటికలో డంపింగ్‌యార్డును ఎత్తివేయాలని, అల్వాల్ జొన్నబండ సర్వే నెంబర్–22, 23 భూములు కబ్జా కాకుండా పరిరక్షించాలని కోరారు. సర్వే నెంబర్–582, 583లో ఉన్న భూములు కబ్జా కాకుండా చూడాలని, మధురానగర్ కాలనీ మున్సిపల్ గ్రౌండ్ స్థలాన్ని పరిరక్షించాలన్నారు. ఇరిగేషన్ సీఈ కోటేశ్వర్, ఈఈ నారాయణ, డీఈ శుక్లజ, నాయకులు అనిల్ కిషోర్‌గౌడ్, మేకల రాముయాదవ్, నరేందర్‌రెడ్డి, మురుగేష్, డోలి రమేష్, లక్ష్మణ్‌యాదవ్, మధుసూదన్‌రెడ్డి, శివగౌడ్, శ్రీధర్‌గౌడ్, వంశీ, హేమంత్, పవన్, మోసిన్, ప్రశాంత్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, సాయిగౌడ్, సుమన్‌గౌడ్, పలు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అదనపు రోడ్ల సమస్యకు పరిష్కారం..

అల్వాల్: ఏవోసి సెంటర్ పరిసర ప్రాంతాల నుంచి అదనపు రోడ్లు కావాలని ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారమైందని, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సుదూర ప్రయాణాలు చేయాల్సిన అవసరం లేకుండా తక్కువ సమయంలో గమ్యస్థానాలు చేరుకునేందుకు మల్కాజిగిరి, కంటోన్మెంట్ ప్రాంతాల్లో ఏవోసీ సెంటర్ పరిసర ప్రాంతాల్లో అదనపు రోడ్లు వేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, గత ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, తెలంగాణ, ఏపీ సబ్ ఏరియా హెడ్‌క్వార్టర్ కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షులు రాజీవ్, కర్నల్ వినయ్‌కుమార్, కమాండింగ్ సురేష్, ఆర్మీ ఉన్నతాధికారులను పలు దఫాలుగా కలిసి వినతిపత్రాలు అందజేశానన్నారు. ఎన్నో ఏళ్లనాటి ఈ అదనపు రోడ్ల సమస్య సాకారం కాబోతుందని ఇందుకు టెండర్ పనులు పూర్తి చేయబోతున్నారన్నారు. ఆర్కేపురం ఫ్లైఓవర్ టెండర్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించినట్లు తెలిపారు.

స్థానిక సమస్యలు పరిష్కరించండి

అల్వాల్: నియోజకవర్గంలో తాగునీరు, మురుగునీరు సమస్యలను పరిష్కరించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బుధవారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.



జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



జలమండలి ఎండీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

కాప్రా: స్వరాష్ట్ర కలసాకారం చేసేందుకు లాఠీ దెబ్బలు, అరెస్టులు, ధర్నాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులు అన్నారు. స్వరాష్ట్రంలో ఉద్యమకారులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారన్నారు. ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులు సుధాకర్, కిరణ్‌కుమార్‌రావు, బండ వినేష్, అశోక్, వినయ్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు : టీజేఎస్

రామంతాపూర్: తెలంగాణ జన సమితి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యవర్గ సమావేశం రామంతాపూర్‌లోని రాంరెడ్డినగర్ సమితి కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన జిల్లా అధ్యక్షుడు భద్రగమ ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం, పోరాటాలు చేయడానికి సమితి సభ్యులు సిద్ధంగా ఉండాలన్నారు. నియోజకవర్గ డివిజన్ కమిటీలను వేగవంతంగా ఏర్పాటు చేసి, వచ్చేనెల జరిగే ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. సమితి కన్వీనర్ బర్మోజు వెంకటాచారి, డివిజన్ అధ్యక్షుడు గాండ్ల లక్ష్మణ్, ప్రతినిధులు ఏర్పుల దయాకర్, శ్రీనివాస్, సుమంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించండి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ మల్లారెడ్డి కాలనీ, సురభికాలనీ, ప్రశాంత్ విహార్, మల్లిఖార్జుననగర్ కాలనీలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ ఆధ్వర్యంలో బుధవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వచౌహాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీల్లో సీసీరోడ్లు, పార్కుల అభివృద్ధి, పిల్లల ఆటస్థలాలను పరికరాలతో అభివృద్ధి చేయడం తదితర పనులు చేపట్టాలని కోరారు. దీనిపై జెడ్సీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మల్లికార్జున్, గురునాథం, తివారీ, రామకృష్ణ, ధర్మారెడ్డి, కుల్దీప్, నర్సింగ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు కాలనీల్లో నేడు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు న్యూ హేమానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

- వివేకానందనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వేణుగోపాల్ వెల్లడించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5గంటల వరకు కరెంట్ సరఫరాను నిలిపేస్తున్నామన్నారు.

మేడిపల్లి: 11కేవీ ప్రగతినగర్ ఫీడర్ పరిధిలో పీఎంఐ వర్క్స్ పనుల మరమ్మతుల కారణంగా 33/11పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ హరినాథ్ సగ్గు ఓ ప్రకటనలో తెలిపారు.

- 11కేవీ వరంగల్ హైవే ఫీడర్ పరిధిలో పీఎంఐ వర్క్స్ మరమ్మతుల కారణంగా 33/11కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2.30 సాయంత్రం 5.30 గంటల వరకు కరెంట్ ఉండదన్నారు.
- 11కేవీ సాయిప్రియ కాలనీ ఫీడర్ పరిధిలో పీఎంఐ వర్క్స్ కారణంగా 33/11కేవీ పర్వతాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దివ్యానగర్ ఫేజ్–1,2, ఎంవీఆర్ కాలనీ తదితర కాలనీల్లో కరెంటు నిలిపివేయబడుతుంది.
- 11కేవీ కాచవాని సింగారం ఫీడర్ పరిధిలో పీఎంఐ వర్క్స్ మరమ్మతుల కారణంగా 33/11 కేవి ప్రతాప్‌సింగారం సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2.00 గంటల నుంచి 5.00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. వినియోగదాలు సహకరించాలని ఏఈ సత్యనారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

ఉప్పల్: ఉప్పల్ కల్యాణపురి విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10.30 నుంచి 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నిఖిల్ నర్సింగరావు తెలిపారు. వేంకటేశ్వర స్వామి టెంపుల్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా గురువారం మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు టెంపుల్‌లేన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ వార్షికోత్సవాలు

బోడుప్పల్: టెలిఫోన్ కాలనీలోని రేణుకాఎల్లమ్మ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం 8 గంటలకు శివశక్తి నరేష్‌స్వామి ఆధ్వర్యంలో ఘటం కల్లు కుండ కార్యక్రమం, ఉదయం 10 గంటలకు అమ్మవారి కల్యాణం, సాయంత్రం 4 గంటలకు బోనాలు, ఒడిబియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఆలయ చైర్మన్, మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, సామల మనోహర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.



వార్షికోత్సవ వేడుకల్లో ఎంపీ ఈటల రాజేందర్

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

మల్కాజిగిరి: రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ శ్రవణ్ సూచించారు. మల్కాజిగిరి డివిజన్ భ్రమరాంబికానగర్‌లో రూ.30 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనుల (రీస్టోర్)ను ఆయన పరిశీలించారు. రహదారి నిర్మాణంతో పాటు డీసిల్టింగ్ కోసం ఏర్పాటు చేసే ఇనుప గ్రిల్స్‌లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. విష్ణుపురి కాలనీలో గతంలో చేసిన పనుల్లో నాణ్యత లేకపోవడంతో ప్రతి ఏటా వర్షాకాలంలో ఇనుపగ్రిల్స్‌కు మరమ్మతులు చేయాల్సివస్తుందన్నారు. కాలనీలోని పార్కు వద్ద ఇంకుడుగుంత ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఈ నవీన్, వీఐ రమేష్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

మల్కాజిగిరి: అక్షర కౌముది సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నేరెడ్‌మెట్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షురాలు తులసీవిజయలక్ష్మి మాట్లాడుతూ.. గత ఆరేళ్లుగా సాహిత్య, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి వారిలో తెలుగుభాష అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. గౌరవాధ్యక్షుడు తులసీ రమణాచార్యులు, మాధవి, రామచంద్రుడు, రాజేంద్రప్రసాద్, పద్మ, శ్రీనివాసరావు, సుబ్బారావు, శేషకుమార్, లలిత పాల్గొనారు.



ఆలయ భూమిని పరిరక్షించండి



అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ రాధాకృష్ణ బాలాజీ దేవాలయం భూమిని పరిరక్షించాలని ప్రజల అభిప్రాయం మేరకు సంతకాల సేకరణ చేసి మచ్చబొల్లారం బీఆర్ఎస్ నేతలు బుధవారం దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణిని కలిసి అందజేశారు. ఆలయం సర్వే నెంబర్–91లో 1.10 గుంటల స్థలాన్ని ఎన్జీవో సంస్థకు లీజుకు ఇచ్చే ప్రతిపాదనలను విరమించుకోవాలని, సదరు స్థలాన్ని పరిరక్షించాలని వారు కోరారు. బీఆర్ఎస్ నేతలు డోలి రమేష్, లక్ష్మణ్‌యాదవ్, పవన్, మల్లేష్‌యాదవ్, తిరుపతిరావు, సురేష్ తదితరులున్నారు.

పేదరికంతో చదువుకు దూరం కావొద్దు

కాప్రా: చదువుకు పేదరికం అడ్డుకాకూడదని, పేదరికం వల్ల చదువుకు ఏ ఒక్క విద్యార్థి దూరం కావొద్దని కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి అన్నారు. బుధవారం గాంధీనగర్‌లోని ప్రభుత్వ స్కూల్‌లో పేద విద్యార్థులకు కాంగ్రెస్ నేత సత్యనారాయణ స్టేషనరీని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సమాజంలో తనవంతు బాధ్యతగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ నేతలు విఠల్‌నాయక్, నాగేష తదితరులున్నారు.



బహిరంగ స్థలాల్లో చెత్తవేస్తే జరిమానా తప్పదు

కమిషనర్ త్రిలేశ్వర్‌రావు



వ్యర్థాలను వేరు చేసే విధానాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ స్వచ్ఛతకు ప్రజలంతా సహకరించాలని నగర కమిషనర్ త్రిలేశ్వర్‌రావు అన్నారు. ఈ మేరకు బుధవారం 100 రోజుల కార్యాచరణలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆటోలకు తడి, పొడిచెత్తను ఇంటివద్దే వేరుచేసి ఆటో కార్మికులకు అందించాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో పారవేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్, డిప్యూటీ ఇంజినీర్ సాయినాథ్‌గౌడ్, మేనేజర్లు క్రాంతికుమార్, కిషోర్,ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ బాలమురళీకృష్ణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం

కాప్రా: కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్త సమ్మె బుధవారం కాప్రా సర్కిల్‌లో విజయవంతమైంది. సీఐటీయూ ఆధ్వర్యంలో కాప్రా సర్కిల్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, 8 గంటల పనిదినాలను కొనసాగించాలన్నారు. స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీసపెన్షన్ రూ.9 వేలకు పెంచాలన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రవి, జిల్లా కోశాధికారి ఉన్ని కృష్ణన్, ఆశా యూనియన్ సభ్యులు, రేవతి, శోభారాణి, అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మల్కాజిగిరిలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నాయకులు గుంటి లక్ష్మణ్, కృపాసాగర్‌లు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక పాలన కొనసాగిస్తుందన్నారు. ప్రజావ్యతిరేక పాలన ప్రభుత్వాలు పతనమైన ఘటనలు మర్చిపోవద్దన్నారు. కార్మిక వ్యతిరేక నిర్ణయాలను తక్షణమే విరమించుకోవాలన్నారు. విజయ్‌కుమార్, రాజ్యలక్ష్మి, స్వాతి, సూర్యకుమార్, చెన్నకేశవ్ తదితరులు పాల్గొన్నారు.



చర్లపల్లి పారిశ్రామికవాడలో సార్వత్రిక సమ్మెలో కార్మిక సంఘాలు

కార్మికులను బానిసలుగా మార్చేందుకు కుట్ర

కుషాయిగూడ: కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కుల కాలారాసే 4 లేబర్ కోడ్‌లను అమలు చేసి కార్మికులను కట్టు బానిసలుగా మార్చేందుకు కుట్ర చేస్తుందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం చర్లపల్లి పారిశ్రామికవాడలోని నిర్వహించిన సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. 8 గంటల పని సమయాన్ని 10 గంటలకు పెంచడం కార్మికులను శ్రమదోపిడి చేయడమేనన్నారు. ఈ సమ్మెలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ తదితక సంఘాలు పాలుపంచుకున్నాయి. నాయకులు చంద్రశేఖర్, శ్రీనివాసులు, ఎం.ఎస్.రావు, కొండల్‌రెడ్డి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, ఐఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం అల్వాల్ సర్కిల్ కార్యాలయం వద్ద కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని, 4 లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకులు రవిచంద్రన్, మహేందర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మహేందర్, కౌసర్, శ్రీనివాస్, తిరుపతి, వెంకటేష్, శేఖర్, సహదేవ్, శ్రీనివాస్, సతీష్, రాజ్‌కుమార్, తులసి, ఎస్ఎఫ్ఏలు గణేష్, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసరావు, గురురాజ్ నర్సింహ తదితరులున్నారు.



మల్కాజిగిరి చౌరస్తాలో..



కాప్రా సర్కిల్ కార్యాలయం ఎదుట..



అల్వాల్ సర్కిల్ కార్యాలయం వద్ద..